మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యం

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ జగన్నాథం తదితరులు

కవాడిగూడ, జనవరి 5: ఆపదలో ఉన్న మహిళలకు భద్రత, రక్షణ, న్యాయం చేయడమే మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యమని సెంట్రల్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథం అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని వివిధ కాలనీలు, బస్తీలలో అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు లైంగిక, మానసిక, శారీరక వేధింపులు, కుటుంబ కలహాల సమస్యలను పరిష్కరించేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా ఎస్ఐలు గౌతమి, చందన మాట్లాడుతూ.. ప్రతి చిన్న విషయంలో తగాదా పడకుండా భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని సంతోషకరమైన జీవితాన్ని గడపాలని అన్నారు. కుటుంబంలో అత్తామామలు, కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరకంగా హింసించినా, కుటుంబ తగాదాల వల్ల భార్యా భర్తలు విడిపోవాలని అనుకున్న వారు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కౌన్సిలింగ్ ద్వారా భార్యాభర్తలకు అవగాహన కల్పించి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళలకు న్యాయ సహాయక, భద్రత అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. మహిళల రక్షణ పట్ల తెలంగాణ ప్రభుత్వం షీ టీంలు, భరోసా, సఖీ సెంటర్, మహిళా పోలీస్‌స్టేషన్ ద్వారా మహిళలకు భద్రత, రక్షణ, న్యాయసలహాలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బొట్టు రమేశ్, శ్రావణి, లావణ్య, వివిధ బస్తీల మహిళలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ రేపు ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 5 : పద్మశాలి సంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం అశోక్‌నగర్ చౌరస్తాలోని అచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ డివిజన కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నిర్వహించే ఈ కార్యక్రమంలో పెద్ద సఖ్యలో పద్మశాలీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బింగి నవీన్‌కుమార్, కార్యదర్శి పున్న సత్యనారాయణ, కోశాధికారి మల్లికార్జున శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

కవాడిగూడ, జనవరి 5: అయోధ్య నుంచి వచ్చిన శ్రీ సీతారాముల పూజిత అక్షింతలను బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు బిజ్జి కనకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా కానీ, వసంతనగర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివ కుమార్, నరేశ్, రాహుల్, అజయ్, వెంకట్, ఉదయ్, మనీ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన..

దాయర మార్కెట్, వైట్ హౌస్ హోటల్ మార్గంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కె.రవిచారి పరిశీలించారు. పనులు చేపడుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా డివిజన్‌లోని పలు బస్తీలలో పర్యటించి డ్రైనేజీ, మంచి నీటి సమస్యలను తెలుసుకున్నారు. –ముషీరాబాద్, జనవరి 5

సెలూన్లు, ల్యాండ్రీ, ధోబీఘాట్లకు ఉచిత విద్యుత్ కొనసాగించడం అభినందనీయం

చిక్కడపల్లి, జనవరి 5 : రజకులు, నాయీబ్రాహ్మణుల కోసం గత ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న నెలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడం అభినందనీయమని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలకు సంబంధించిన ఉచిత విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాను కట్ చేయవద్దని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయీబ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, రజక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె. వెంకటయ్య, చిట్యాల రామస్వామి, పి.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అభ్యాస్' చిత్ర ప్రదర్శన

చిత్రాలను తిలకిస్తున్న తన్నీరు శ్రీనివాస్

చిక్కడపల్లి, జనవరి 5 : ప్రముఖ కళాకారుడు, కవి నరేంద్రరాయ్ విద్యార్థుల చే అభ్యాస్ – 7 పేరట శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ జనరల్ సెక్రటరీ తన్నీరు శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనలో ప్రతి చిత్రం ఆకట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు జీవై గిరి, చిప్పా సుధాకర్, చిత్ర కళాకారుడు పీఎస్ మూర్తి, ప్రీతి జైన్, దీక్షితా యాదవ్, దిశా అగర్వాల్, రాఖీ లడ్డా, సాన్వి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతల ఊరేగింపు

అక్షింతల ఊరేగింపు మహోత్సవంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావని తదితరులు

చిక్కడపల్లి, జనవరి 5 : అయోధ్య శ్రీ రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ పూజిత అక్షింతల ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు మహోత్సవం శుక్రవారం వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ హాజరై శ్రీ రాముని అక్షింతలు అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడుతూ అయోధ్య భవ్యరామ మందిర నిర్మాణ ప్రపంచ వ్యాప్తంగా సనాతన ధర్మాన్ని నిలపెడుతుందన్నారు. బీజేపీ నాయకులు పూసరాజు, బీజేవైఎం పూర్వ అధ్యక్షుడు వినయ్‌కుమార్, నాయకులు రత్నసాయి చంద్, శ్రీకాంత్, ఉమేశ్, సురేందర్, సత్తిరెడ్డి, సురేశ్, ప్రకాశ్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నడిగులు ఐక్యంగా ఉంటారు : ఆర్టీసీ ఎండీ సజ్జనార్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్, విఠల్ జోషి, కృష్ణమూర్తి తదితరులు

కాచిగూడ, జనవరి 5: దేశంలో నివసిస్తున్న కన్నడిగులు ఐక్యంగా ఉంటారని టీఎస్ఆర్‌టీసీ ఎండీ వి.సి. సజ్జనార్ అన్నారు. కర్ణాటక సాహిత్య మందిర్ ఆధ్వర్యంలో నేడు (శనివారం) బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రామాయణంపై తోలుబోమ్మలాట ప్రదర్శన కార్యక్రమాన్ని సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు డాక్టర్ విఠల్‌జోషి తెలిపారు. ముఖ్య అతిథిగా ఆర్టీసీ ఎండీ వి.సి. సజ్జనార్ హాజరై రామాయణంపై తోలుబోమ్మలాట పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణామూర్తి, రత్నాకర్, ఎన్‌కే రాంమూర్తి, డి.రామచంద్ర, వి.రామచంద్ర పాల్గొన్నారు.

మంజులకు పురస్కారం..

హైకోర్టు న్యాయవాది మంజులకు సావిత్రి బాయిపూలే విశిష్ట పురస్కారం దక్కింది. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ జన జాగృతి నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి , బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జన జాగృతి అధ్యక్షుడు కె.పి. మురళీకృష్ణ పాల్గొన్నారు. – చిక్కడపల్లి, జనవరి 5

సైబర్ ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, జనవరి 5: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతీ యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఆమె మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువతులు ఈ నెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7893141797 సంప్రదించవచ్చని కోరారు.

అయ్యప్ప స్వాములకు సన్మానం

రంగానగర్‌లో అయ్యప్ప గురుస్వామి వై. శ్రీనివాస్‌రావు, హర్షవర్ధన్ రావులతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు షబరిమలైకి వెళ్తున్న సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ సత్కరించారు. అనంతరం అయ్యప్ప స్వాములు షబరికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఎ. శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. – కవాడిగూడ, జనవరి 5

రేపు ఉచిత వైద్యశిబిరం

కాచిగూడ, జనవరి 5: అంబర్‌పేట హిందూ శ్మశానవాటిక ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రేపు ఉదయం ఆదివారం 10 గంటలకు మహిళలకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హిందూ శ్మశానవాటిక ప్రభందక కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్‌రావు తెలిపారు. ముఖ్యఅతిథులుగా సరోజావివేక్, రచయిత్రి రాధిక కృష్ణ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌రాజు మృతి

గోల్నాక, జనవరి 5 : అంబర్ పేట మండల తాసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న చెన్నారెడ్డినగర్‌కు చెందిన బీవీ మహేశ్‌రాజు ఆకస్మికంగా మృతి చెందాడు. గత గురువారం తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కుటుబ సభ్యులు గాంధీ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్... మహేశ్‌రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోల్నాక హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, జనవరి 5: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ మక్సూద్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(30)ఉప్పుగూడ–యాకత్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య శుక్రవారం రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతిని ఒంటిపై బూడిది రంగు టీషర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి,ఎత్తు 5.5 ఉన్నటు తెలిపారు. వివరాలకు 9912221985లో సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.